

30న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా జిల్లాలో వివిధ క్రీడాంశాల్లో ఈ నెల 30న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను ఆచంట నియోజకవర్గంలోని కొడమంచిలి జెడ్‌పి హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.సురేంద్రబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలకొల్లు నియోజకవర్గం ఎస్.చిక్కాలలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు, డిఎన్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా జగనన్న క్రీడా క్లబ్‌లలో రిజిస్ట్రేషన్ అయ్యి ఉండాలని తెలిపారు. తప్పనిసరిగా పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ జిరాక్స్ తీసుకు రావాలని సూచించారు.

కౌలుదారుపై..
కనికరం లేదాయె..!



బ్యాంకు రుణం నుంచి రైతుభరోసా వరకూ ఏ ఒక్కటీ అందని పరిస్థితి

రబీలోనైనా రుణాల మంజూరులో న్యాయం జరిగేనా

2019 పంట సాగుదారు హక్కుచట్టంతో అంతా అస్తవ్యస్థం

ఇ-క్రాప్‌లో పేరులేక ధాన్యం సైతం అమ్ముకోలేని దుస్థితి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3 లక్షల మంది కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వాస్తవ సాగుదారుడైన కౌలురైతులను ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. '2019 పంట సాగుదారు హక్కుచట్టం' తెచ్చి కౌలురైతులకు ప్రభుత్వ సాయం ఏ ఒక్కటీ అందకుండా చేసింది. దీంతో కౌలురైతులు వ్యవసాయ సాగులో తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక కౌలురైతులు ఉన్నది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే. అధికారుల లెక్కల ప్రకారం మూడు లక్షల మందికిపైగా కౌలురైతులు జిల్లాలో ఉన్నారు. 2011 భూఅధీకృత సాగుదారుని హక్కు చట్టంతో కౌలురైతులకు కొన్ని హక్కులు కల్పించారు. భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డు జారీచేసి బ్యాంకు రుణాల నుంచి ప్రభుత్వం అందించే ప్రతి సాయం కౌలురైతులకు అందేలా చట్టంలో పేర్కొన్నారు. దీంతో అధికారులు కౌలుకార్డులు ఇవ్వకపోతే రైతుసంఘాల ఆధ్వర్యంలో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు నిర్వహించి సాధించుకునేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2011 కౌలుచట్టంలో ఏకపక్షంగా మార్పులు చేసేసింది. దాని స్థానంలో 2019 పంట సాగుదారు హక్కుచట్టం తెచ్చింది. ఈ చట్టంలో భూయజమాని అంగీకారం లేకుండా కౌలు రైతులకు సిసిఆర్‌సి(కౌలుకార్డు) ఇవ్వకూడదని తెలిపింది. సిసిఆర్‌సి కార్డు లేకుంటే బ్యాంకు రుణం నుంచి బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతుభరోసాతోపాటు చివరికి ధాన్యం అమ్ముకునే పరిస్థితి కూడా కౌలురైతులకు లేకుండాపోయింది. కౌలుకార్డులు కూడా అరకొరగా మంజూరు చేస్తున్నారు. కార్డులు ఇచ్చినవారికి కూడా బ్యాంకు రుణాలుగాని ప్రభుత్వ సాయం పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది.

కౌలురైతుల గురించి పట్టించుకునేవారేరీ

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 70శాతానికిపైగా వ్యవసాయ సాగు కౌలురైతులే చేస్తున్నారు. తమ భూములు కౌలుకిచ్చేసి భూయజమానులంతా వ్యాపారాలు చేసుకుంటున్నారు. వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు అందించాల్సిన సాయం మాత్రం సాగుచేయని భూయజమానులకే ప్రభుత్వం అందిస్తోంది. నిబంధనల ప్రకారం పంటరుణం సాగుచేసే రైతుకు అందించాలి. భూయజమానికి పంటేతర రుణం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే బ్యాంకులు కౌలు రైతులకు పంటరుణాలు ఇవ్వడం లేదు. రైతుమిత్ర గ్రూపులకు అరకొరగా రుణాలిచ్చి అవే కౌలురైతులకిచ్చిన రుణాలుగా కాగితాల్లో చూపిస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలో కౌలురైతులకిచ్చిన రుణాలపై ఏఒక్క అధికారీ నోరు మెదపని పరిస్థితి ఉంది. ముఖ్యంగా వ్యవసాయ శాఖాధికారులు కౌలురైతుల గురించి పట్టించుకోని పరిస్థితి జిల్లాలో కనిపిస్తోంది. ప్రస్తుతం పండించిన ధాన్యం సైతం భూయజమాని పేరుపైనే కౌలురైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. భూయజమాని అంగీకరించలేదని సిసిఆర్‌సి కార్డులు ఇవ్వకుండా భూయజమానికి ఉన్న సాగుభూమి అంతా వారిపేరుపైనే ఇ-క్రాప్ చేశారు. ఇప్పుడు 12.50 ఎకరాలు వరకూ మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామని నిబంధన పెట్టారు. మరి ఆ భూయజమాని పొలం సాగు చేసిన కౌలురైతులు ధాన్యం ఏవిధంగా అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. సాగుచేసే రైతుకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందిస్తున్న రైతుభరోసా కూడా కౌలురైతులకు అందడం లేదు. ఏదో ఒకరిద్దరికి ఇచ్చి కౌలురైతులకు ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నారు. రబీలోనైనా కౌలురైతులకు పూర్తిస్థాయిలో బ్యాంకు రుణాలు అందించడంతోపాటు భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా సిసిఆర్‌సి కార్డులు ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

కదంతొక్కిన సిపిఎస్ ఉద్యోగులు

యుటిఎఫ్ ఆధ్వర్యాన 10 కె వాక్ పేరిట భారీ ర్యాలీ

ఒపిఎస్‌ను అమలు చేయాల్సిందే

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎస్ ఉద్యోగులు మరోసారి కదం తొక్కారు. సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన 10కె వాక్ పేరిట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సిపిఎస్‌ను అమలు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వ పతనం తప్పదంటూ హెచ్చరిస్తూ తమ సమస్యలు పరిష్కరించాలని నినదించారు. సిపిఎస్‌ను రద్దు చేయకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయులు హెచ్చరించారు. జిల్లా నలుమూలల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు సుమారు 500 మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ 10కె వాక్ ర్యాలీ ప్రకాశం చౌక్ సెంటర్ మీదుగా కొత్త బస్టాండ్ నుంచి అన్నపూర్ణ థియేటర్ రోడ్డు, పోలీస్ బొమ్మ సెంటర్, ప్రకాశం చౌక్, అంబేద్కర్ సెంటర్, గాంధీ సెంటర్, నటరాజ్ థియేటర్ రోడ్డు మీదగా నుంచి తిరిగి యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడారు. నాడు ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారం చేపట్టి మూడున్నరేళ్ళు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఒపిఎస్‌ను అమలు చేయకుండా సిపిఎస్ స్థానంలో జిపిఎస్ ఇస్తామని మాయమాటలు చెబుతున్నారన్నారు. ఇప్పటికే సిపిఎస్ రద్దుకు అనేక పోరాటాలు చేస్తామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ ఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని అడగటమే తప్పుగా ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ పాలన రాజ్యాంగ విరుద్ధంగా సాగుతుందని ఆరోపించారు. సమాజంలో నిరసన తెలుపుకునే హక్కు ప్రతిఒక్కరికీ ఉంటుందని, అయితే ఈ ప్రభుత్వం ఆ హక్కును కాలరాస్తోందని మండిపడ్డారు. ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్‌ను రద్దు చేయాలని, లేనిపక్షంలో వైసిపి ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి పరాభావం తప్పదని స్పష్టం చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ పట్టణంలో 10కె వాక్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. డిసెంబర్ 4, 10, 11 తేదీల్లో తణుకు, తాడేపల్లిగూడెం, మార్టేరు, పాలకొల్లు, నరసాపురం పట్టణాల్లోనూ 10కె వాక్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రతి సిపిఎస్ ఉద్యోగి ఇంటికీ యుటిఎఫ్ పేరుతో ఇంటింటా ప్రచారం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పశ్చిమ, ఏలూరు జిల్లాల యుటిఎఫ్ సిపిఎస్ సబ్‌కమిటీ కన్వీనర్లు కెఎస్.రామకృష్ణ ప్రసాద్, కె.కమల్, జిల్లా గౌరవాధ్యక్షులు మార్కండేయులు, జిల్లా సహాధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా కార్యదర్శులు ఎస్ఎస్.రత్నంరాజు, టిఎస్.జయకర్, పి.క్రాంతికుమార్, కెఎస్.సాయిరాం, జి.రామకృష్ణంరాజు, బిజెవిడి.రాజ్యలక్ష్మి, ఎం.శ్రీనుబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జివి.రామానుజరావు, సిహెచ్.కృష్ణమోహన్, జి.వీరన్న, నేతలు పాల్గొన్నారు.



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో రామం పాత్ర వీరోచితం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం

పలుచోట్ల వర్ధంతి సభలు

ప్రజాశక్తి - భీమవరం

నిర్బంధ కాలంలో అజ్ఞాతంలో ఉంటూనే జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో ఉద్దరాజు రామం వీరోచిత పాత్ర నిర్వహించారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. ఉద్దరాజు రామం 28వ వర్ధంతి సభ స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఎం.వైకుంతరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామం చిత్రపటానికి సీతారాంతోపాటు జిల్లా కార్యదర్శి బి.బలరాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సీతారాం మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని తొమ్మిది నెలలు జైలు శిక్ష అనుభవించారన్నారు. 1935లో పశ్చిమగోదావరి జిల్లా యువజన సంఘం ఏర్పాటులో కీలక పాత్ర పోషించి అధ్యక్షునిగా ఎన్నికయ్యారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధం విధించడంతో అజ్ఞాతంలో ఉండి రహస్యంగా పనిచేశారన్నారు. 1957లో జరిగిన ఎన్నికల్లో నరసాపురం ఎంపీగా గెలుపొంది ప్రజా సమస్యలను పార్లమెంట్లో గళమెత్తిన వ్యక్తి రామం అని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ రామం రైతుసంఘం నాయకునిగా ఎనలేని సేవలందించారన్నారు. రామం వీరోచిత పోరాటాల వెనుక ఆయన భార్య మాణిక్యంబ కూడా సముచిత పాత్ర పోషించారని గుర్తు చేశారు. సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు డి.కళ్యాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి.చైతన్యప్రసాద్ పాల్గొని మాట్లాడారు.

నరసాపురం: కమ్యూనిస్టు యోధుడు ఉద్దరాజు రామం చిరస్మరణీయులని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. స్వాతంత్రోద్యమ నాయకులు, కమ్యూనిస్టు పార్టీ జిల్లా వ్యవస్థాపకుల్లో ముఖ్యులు రామం 28వ వర్ధంతి సభ ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ జిల్లాలో స్వాతంత్రోద్యమ కాలంలో జమిందారుల దుర్మార్గాలకు వ్యతిరేకంగా రామం పోరాడారన్నారు. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులుగా రైతాంగ సమస్యలపై పోరాటాలు సాగించారన్నారు. ప్రజల కోసం పోరాడి అనేకసార్లు జైలు జీవితం అనుభవించారన్నారు. నర్సాపురం ఎంపీగా పని చేసిన కాలంలో ప్రజల సమస్యలు పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. జీవితాంతం శ్రామిక ప్రజల పక్షాన నిస్వార్థంగా పోరాడి మరణించిన ఉద్దరాజు రామం ఆదర్శప్రాయులని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, మండల కార్యదర్శి బొక్కా శ్రీనివాస్, మొగల్తూరు మండల నాయకులు యడ్ల చిట్టిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

తాడేపల్లిగూడెం: స్వాతంత్ర సమరయోధుడు ఉద్దరాజు రామం 28వ వర్ధంతి సభ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సభలో పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కమిటీ సభ్యులు కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ జీవితాంతం ప్రజల పక్షాన నిలిచి పోరాడిన యోధుడు ఉద్దరాజు రామం అని కొనియాడారు. రామం ఆశయాలను కొనసాగిస్తామని కార్యకర్తలు నినదించారు. కార్యక్రమానికి సిహెచ్.రాము, కె.వెంకటేశ్వరరావు, టి.శ్రీనివాస్, పి.పైడియ్య, ఎస్.కృష్ణ, ఎ.ధర్మారావు, ఎం.రమణ, పి.రమణ, ఎస్.శేషుబాబు, కె.శివాజీ, ఎ.లోవ, ఎ.ధర్మారావు పాల్గొన్నారు.

తణుకురూరల్: పీడిత ప్రజల విముక్తి కోసం.. సమసమాజ నిర్మాణం కోసం ప్రజల పక్షాన నిలిచి పోరాడిన యోధుడు ఉద్దరాజు రామం అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్, గ్రామ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు కొనియాడారు. వేల్పూరులోని ప్రజాసంఘాల భవనంలో సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రామం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్, వీరభద్రరావు మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని తొమ్మిది నెలలపాటు జైలు శిక్ష అనుభవించారన్నారు. కాళీపట్నంలో రైతులు తమ హక్కుల కోసం సాగించిన పోరాటానికి రామం నాయకత్వం వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో విశ్వనాథం సుబ్బారావు, తిరునాథం వెంకటేశ్వరరావు, రుద్రాక్షుల శ్రీను, కరెళ్ల అర్జున్, దున్నె నాగేశ్వరరావు, కుడకా వీరభద్రరావు, నక్కా సత్యనారాయణ, యండమూరి నాగేంద్ర, ఏసు, బళ్ల నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్దరాజు రామం ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సిపిఎం కృషి చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ అన్నారు. స్థానిక అమరవీరుల భవనంలో రామం 28వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, అడగర్ల అజయకుమారి, కామన మునిస్వామి, సింగులూరి సత్యనారాయణ, నర్సింహారావు, కడలి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉండి: జీవితాంతం ప్రజల పక్షాన పోరాడిన యోధుడు ఉద్దరాజు రామం అని సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద రామం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చీర్ల శేషు, నిమ్మితి కిషోర్, రామకూరి వెంకటరత్నం, మోపిదేవి రాము, ఇర్రింకి శ్రీరామ్మూర్తి, కొట్టాడ వెంకటేశ్వరరావు, కాల్వ వెంకన్న, గండికోట ఏడుకొండలు పాల్గొన్నారు.

పాలకొల్లు: రైతు ఉద్యమ నేత, మాజీ ఎంపీ ఉద్దరాజు రామం జీవితం ఆదర్శప్రాయమని సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రామం వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడిత, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం రామం ఎనలేని కృషి చేశారని రైతుసంఘం నేత వలవల శ్రీరామమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు చల్లా సోమేశ్వరరావు, పి.సాంబశివరావు, యర్రా అజయ్, బాసిన శ్యామల పాల్గొన్నారు.

పెనుమంట్ర: అతి చిన్న వయసులోనే ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని కారాగార శిక్ష అనుభవించిన ధీరుడు ఉద్దరాజు రామం అని రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం అన్నారు. రామం 28వ వర్ధంతి ఆదివారం బ్రాహ్మణచెరువులో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, నేతలు చింతపల్లి లక్ష్మికుమారి, గంటి ఆంజనేయులు, బొంతు నాగేశ్వరరావు, బొంతు ఏడుకొండలు, కంబాల వెంకటేశ్వరరావు, కవురు రామకృష్ణ, కడలి శ్రీరామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఆచంట: కాళీపట్నం రైతుల హక్కుల కోసం అలుపెరుగకుండా పోరాడిన నేతఉద్దరాజు రామం అని సిపిఎం నాయకులు తోటపల్లి సత్యనారాయణ, ఇందుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. రామం 28వ వర్ధంతి కార్యక్రమాలు మండలంలోని వల్లూరు, ఆచంటలో నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నేతలు ఎస్‌విఎన్.శర్మ, సిర్రా నరసింహమూర్తి, పరువు మోహన్‌రావు, బొర్రా ధర్మారావు, తలుపురి బుల్లబ్బాయి, మధు కిరణ్, తామరాపు దుర్గాప్రసాద్, తాళం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన ఖరారు

మూడురోజుల పాటు ఉమ్మడి జిల్లాలో పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఈ నెల 30 నుంచి డిసెంబర్ రెండో తేదీ వరకూ మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూల్‌ను ఆదివారం టిడిపి నేతలు విడుదల చేశారు. 30వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు కలపర్రు టోల్‌గేట్ వద్ద నుంచి బైక్‌ర్యాలీగా బయలుదేరతారు. 11.30 గంటలకు పెదవేగి మండలం విజయరాయిలో బహిరంగ సభ జరగనుంది. మూడు గంటలకు వలసపల్లి క్రాస్‌రోడ్, ధర్మాజీగూడెం, మట్టమ్మగూడెం, లింగపాలెంలో మాట్లాడనున్నారు. ఆరు గంటలకు చింతలపూడిలో రోడ్‌షో సాగనుంది. ఏడు గంటలకు బోసుబొమ్మ సెంటర్‌లో బహిరంగ సభ జరగనుంది. రాత్రికి నరసన్నపాలెంలోని దండమూడి రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో బస చేయనున్నారు. డిసెంబర్ ఒకటో తేదీ 10.30 గంటల వరకూ బిసిలతో సమావేశం కానున్నారు. మూడు గంటలకు పోలవరంలో బహిరంగ సభ జరగనుంది. అనంతరం కొవ్వూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రాత్రి ఎనిమిది గంటలకు మెరకవీధి విజయవిహార్ సెంటర్‌లో బహిరంగ సభలో ప్రసంగించి రాత్రికి సుందరసాయి నిగమమ్ ఫంక్షన్‌హాల్‌లో బస చేయనున్నారు. రెండో తేదీన మూడు గంటలకు నిడదవోలు గణేష్‌చౌక్‌లో బహిరంగ సభ జరగనుంది. అనంతరం పర్యటన కొనసాగనుంది. మధ్యలో వరిరైతులతో సమావేశం కానున్నారు. అనంతరం రాత్రి 7.30 గంటలకు తాడేపల్లిగూడెం శేషమహల్ సెంటర్‌లో బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. అనంతరం విజయవాడ బయల్దేరి వెళ్లనున్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చండి

కమిషనర్ వద్ద టిడ్కో గృహవాసుల వేదన

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడ్కో గృహాల వద్ద పారిశుధ్యం మెరుగుపర్చాలని, ప్రతిరోజూ చెత్త తీసుకెళ్లడం లేదని ఆ ప్రాంత నివాసితులు మున్సిపల్ కమిషనర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పర్యటించారు. ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నివాసితులు మాట్లాడుతూ తాగునీటి ట్యాంకర్లు దూరంగా నిలపడం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నివాసాల వద్ద ట్యాంకర్లు ఆపాలని కోరారు. వీధి దీపాలు తరచూ పని చేయడం లేదని, అవి సక్రమంగా పని చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కుమార్ రాజా, శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.


టిడ్కో గృహాల నివాసితుల సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

కెవిపిఎస్ రాష్ట్ర మహాసభకు తరలిన ప్రతినిధి బృందం

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 28, 29 తేదీల్లో కర్నూలు జిల్లాలో జరగనున్న కెవిపిఎస్ 4వ రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి ప్రతినిధి బృందం ఆదివారం బయలుదేరి వెళ్లింది. భీమవరం నుంచి కర్నూలు వెళుతున్న కెవిపిఎస్ జిల్లా ప్రతినిధి బృందానికి టౌన్ రైల్వే స్టేషన్‌లో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, దళిత సంఘ నాయకులు సంఘీభావం తెలిపి మహాసభలో జయప్రదం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక ఉద్యమాలకు నాయకత్వం వహించే కెవిపిఎస్ రాష్ట్ర మహాసభలు రెండు రోజులపాటు జరుగుతున్నాయని తెలిపారు. కులవివక్షపై, అంటరానితనంపై ప్రత్యక్ష పోరాటాలు, ఎన్నో ప్రతిఘటన ఉద్యమాలు నిర్వహించిన కర్నూలు జిల్లాలో ఈ మహాసభలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుండి సుమారు 400 మంది ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. జిల్లా నుంచి 20 మంది ముఖ్యనాయకులు ప్రతినిధులుగా ఈ మహాసభలకు హాజరవుతున్నారని చెప్పారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంట సుందర్ కుమార్ మాట్లాడుతూ దళిత సమస్యలపై నిరంతరం పోరాడే కెవిపిఎస్ రాష్ట్ర మహాసభ జయప్రదం కావాలన్నారు. సామాజిక ఉద్యమాల్లో కెవిపిఎస్ పాత్ర ఎనలేనిదని అన్నారు. ప్రతినిధి బృందంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, అధ్యక్షులు బత్తుల విజయకుమార్, జిల్లా సహాయ కార్యదర్శులు చిన్నం చిన్న నాగేశ్వరరావు, కప్పల రత్నం రాజు, ఇంజేటి శ్రీనివాస్, కానేటి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు తనుకుల చంటి, సిహెచ్ ఏసురత్నం, ఏడుకొండలు, పి.శ్యాంబాబు, నాయకులు కొండేటి సుధీర్ బాబు, ఎండి షాజమా ఉన్నారు.


కెవిపిఎస్ రాష్ట్ర మహాసభలకు వెళ్తున్న కెవిపిఎస్ ప్రతినిధి బృందం

మంచు కురిసే వేళలో..

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆదివారం తెల్లవారు జామున పట్టణ పరిసర ప్రాంతాల్లో విపరీతంగా మంచు కమ్మేసింది. ఎక్కువగా మంచు పడడంతో వాహనదారులు నానా పాట్లు పడుతున్నారు. పాలకొల్లు - భీమవరం - పెనుగొండ - నరసాపురం - దొడ్డిపట్లకు వెళ్లే అన్ని రహదారులను మంచు దుప్పటి కప్పేసింది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.


పాలకొల్లులో కురుస్తున్న మంచు



విద్యార్థినికి నగదు అందజేస్తున్న మానవత సభ్యులు

మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తణుకు

మానవత ఆధ్వర్యంలో పేద, మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేసినట్లు సంస్థ అధ్యక్షులు నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో అమెజాన్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న బొప్పిడి అవినాష్‌కు రూ.25 వేల రూపాయలు నగదు బహుమతి అందజేసినట్లు తెలిపారు. ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో సర్వింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న పేద విద్యార్థిని కె.రమ్యకు 5000 రూపాయలు, బిటెక్ ఫస్టియర్ చదువుతున్న గంగాభవానికి 5000 రూపాయల ఫీజు నిమిత్తం వారికి అందజేసినట్లు చెప్పారు. రాష్ట్ర కన్వీనర్ కోడూరి రాధా పుష్పవతి మాట్లాడుతూ ఇప్పటివరకు వరకూ దాదాపు 100 మందికి పైగా ప్రతిభావంతులను సన్మానించి వారికి బహుమతులను మానవత ద్వారా అందజేయడం జరిగిందని. రాష్ట్ర వ్యాప్తంగా 96 మండలాల్లోనూ నిరంతరంగా పేద, మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బోయపాటి రామలక్ష్మి, జిల్లా శాంతి ర్యాలీ ఛైర్మన్ గమిని రాంబాబు, సంస్థ సెక్రటరీ కొల్లేపర సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు బాలాజీ, విశ్రాంతి ప్రిన్సిపల్ ఎస్ మనోరమ, మానవత సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకు

ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని 34వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇంటి స్థలం అందించిన వారందరికీ ఇల్లు కట్టించి ఇవ్వడం జరుగుతుందని, ఎవ్వరూ ఇబ్బందులు పడవద్దని తెలిపారు. ప్రతి వార్డులో అభివృద్ధి పనులను సత్వరమే చేపట్టడం, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే గడపగడపకూ మన ప్రభుత్వం ఉద్దేశ్యమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

సూపర్‌స్టార్ కృష్ణ సంస్మరణ దినం సందర్భంగా స్థానిక మారుతీ సినిమా థియేటర్ వద్ద ఆదివారం కృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ చిత్రపటానికి సంఘ గౌరవాధ్యక్షులు మేకేకొండ శ్రీనివాస్, అధ్యక్షులు వాడవల్ల శ్రీనివాస్, కార్యదర్శి ఉద్దగిరి మణికంఠ, కోశాధికారి పినిశెట్టి బుజ్జి, పినిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆచంట : సూపర్ స్టార్ కృష్ణ ఆకాల మరణం కారణంగానికి, అభిమానులకు తీరనిలోటని కృష్ణ ఫ్రెండ్స్ మండల అధ్యక్షులు ఎస్.సూర్యనారాయణ (ఆర్‌టిసి) అన్నారు. ఆదివారం ఆచంటలో కృష్ణ అభిమానులు ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కారుమిల్లి ప్రసాద్, మనుకుర్తి సుధాకర్, బొట్ల చక్రి, సిర్రా నరసింహమూర్తి, పీతల రాము, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ పోతే ఫిర్యాదు చేయండి : జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రయాణాల్లో ఎక్కడైనా సెల్‌ఫోన్ పడేసుకున్నా, ఎవరైనా దొంగలించినా 9145996500 వాట్సప్ నంబరు ద్వారా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్‌పి ఎం.రవి ప్రకాష్ తెలిపారు. ఇటీవల సెల్‌ఫోన్లు పోయాయని చాలా మంది ఫిర్యాదు చేయడంతో సెల్‌ఫోన్ ట్రాక్ (ట్రాకింగ్ 251 ఫోన్లు గుర్తించామన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు సమాచారం ఇచ్చి అందజేశారు. చోరీకి గురైన ఫోన్లు కొనుగోలు చేసినవారిని గుర్తించామని తెలిపారు. బిల్లు లేని సెల్ ఫోన్లు కొనుగోలు చేయరాదన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు : సిఐ

ప్రజాశక్తి - పాలకోడేరు

రౌడీ షీటర్లు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని భీమవరం రూరల్ సిఐ నాగ ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ పాలకోడేరు పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నాగ ప్రసాద్ మాట్లాడుతూ సంక్రాంతి నేపథ్యంలో జూదాలు, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే వెంటనే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామచంద్రరావు, ఎఎస్ఐ డివి.శ్రీనివాస్, కానిస్టేబుళ్లు శంకర్, తేజ, మహేంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలవపూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - కాళ్ల

కలవపూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొచ్చి మనబడి నాడు - నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాధరాజు, పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, గణేశ్న రాంబాబు, వేగేశ్న బాల గణపతి వర్మ, సాగిరాజు హరి వర్మ పాల్గొన్నారు.

రేలంగిలో పెట్రోల్ బంకు ప్రారంభం

ప్రజాశక్తి - ఇరగవరం

వైసిపి వెన్నుదన్నుగా పులుపు శ్రీను కుటుంబం ఉంటోందని, వారి ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ బంక్ వినియోగదారులకు మంచి సేవలందించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం రేలంగి గ్రామంలో వైసిపి నాయకులు పులుపు శ్రీను అక్కమాంబ దంపతుల చిన్న కుమారుడు పులుపు సునీల్ ఏర్పాటు చేసిన నూతన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను కారుమూరి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ వినియోగదారులకు మంచి సేవలందించి, లాభాలు ఆర్జించాలన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, రేలంగి సొసైటీ అధ్యక్షులు నడింపల్లి రాంబాబు, పులుపు అనిల్, వడ్డే మార్కండేయులు, వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

సిపిఎం సీనియర్ నేత..
నాగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

సిపిఎం సీనియర్ నేత వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన వీరవల్లి నాగేశ్వరరావు (65) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి సంతాపం తెలుపుతూ సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, యాళ్లబండి నారాయణమూర్తి, కల్లెడ సత్యనారాయణ, కవురు సుబ్బారావు, మైగాపుల త్రిమూర్తులు, మైగాపుల రాంబాబు, చెన్ను సుబ్బారావు నాగేశ్వరరావు మృతదేహంపై సిపిఎం జెండా కప్పి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మోకాళ్ల నొప్పులున్నప్పటికీ నాగేశ్వరరావు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని తెలిపారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన పార్టీ పట్ల, ప్రజా పోరాటాల పట్ల అంకిత భావంతో ఉండేవారని తెలిపారు. రైతాంగ సమస్యలపై, రైతుల ధాన్యం బకాయిలపై పోరాడేవారని తెలిపారు. శుక్రవారం కొద్దిపాటి జ్వరంతో భీమవరం ఆసుపత్రిలో నాగేశ్వరరావు చేరారని, అక్కడ మృతి చెందారని తెలిపారు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతితో వీరవల్లిపాలెంలో మంచి కార్యకర్తను కోల్పోయామంటూ సిపిఎం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.



వీరవల్లిపాలెంలో ఆయనకు నివాళు లర్పిస్తున్న సిపిఎం నాయకులు

వీరవాసరంలో అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం మద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. తులసీ కళ్యాణ మండపం వేదికగా 1969-70 బ్యాచ్‌కు చెందిన ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైయర్ సెకండరీ విద్యార్థులు ఈ వేడుకను నిర్వహించుకున్నారు. ఈ వేడుకలో 65 సంవత్సరాల పైబడిన వారు పాల్గొని తమ ఆనందాలను, ఆప్యాయతలను పంచుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్నవారందరూ ఒక చోటకు చేరి ఈ వేడుకలో పాల్గొని వారి యోగ, క్షేమాలు తెలుసుకున్నారు. నాటి విద్యార్థులు నేటి విద్యార్థులుగా మారి సంతోషంగా గడిపారు. వారితో పాటు వారి కుమార్తెలు, కుమారులు, మనవరాలు వచ్చి వారి జ్ఞాపకాల్లో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ 150 సంవత్సరాల శతాబ్ది స్వర్ణోత్సవాల సావనీర్‌ను పూర్వ విద్యార్థుల చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యాదాత మద్దాల రామకృష్ణమ్మకు, తెలుగు జాతీయ కవి చికలమర్తి లక్ష్మీనరసింహం పంతులుకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమం గుండా రామకృష్ణ, నరసింహారావు, కోటేశ్వరరావు, దంపనబోయిన సత్యనారాయణ, శ్రీరామ్మూర్తి, మరి కొంతమంది సహకారంతో నిర్వహించారు.

విభజన హామీలు అమలు చేయాలి

వామపక్షాలు, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ వామపక్షాలు, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన ధర్నాకు మద్దతుగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ఇస్తానన్న విభజన హామీలు అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాయితీలు కల్పిస్తామని, ఎన్నికల సమయంలో బిజెపి హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు విస్మరించిందన్నారు. హోదా, ప్యాకేజీ తీసుకొస్తామని టిడిపి, వైసిపిలు ఎన్నికల సమయంలో పోటీపడి హామీలు ఇచ్చాయని, వాటిపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. అధికారలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక హోదా, రైల్వే జోన్, యువతకు ఉపాధి కల్పనకు అవసరమైన పరిస్థితులు కల్పించాలని బిజెపిని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ప్రశ్నించిన దాఖలాలు లేవని విమర్శించారు. ఈ సమస్యలపై వామపక్షాలు అనేక పోరాటాల చేపట్టాయని గుర్తుచేశారు. వెనుకబడ్డ ప్రాంతాలకు నిధులు, కడప ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు ఇవ్వకుండా బిజెపి మోసం చేసిందని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటు పరం చేసే ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేక హోదా సాధించేందుకు అన్ని పార్టీలూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మోడీ రాష్ట్రానికి విభజన హామీలు అమలు చేయకుండా తీవ్రంగా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఒకపక్క ధరలు పెంచుతూ మరోపక్క కార్పొరేట్ వ్యక్తులు రాయితీలిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. దళిత సంఘాల నాయకులు గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని, ఉపాధి అవకాశాలు లేకుండా దెబ్బతీసిందని విమర్శించారు. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, వడుగు వెంకటేశ్వరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు సిపిఐ నాయకులు సికిలే పుష్పకుమారి, దళిత సంఘాల నాయకులు జోనా, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి క్రాంతి బాబు, ప్రముఖ సంఘసేవకులు రంగ సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

వైసిపిలోకి పెదఅమిరం సర్పంచి సోమేశ్వరరావు

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాభివృద్ధికి జగన్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై టిడిపి సర్పంచి డొక్కు సోమేశ్వరరావు వైసిపిలో చేరడం అభినందనీయమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. ఆదివారం పెదఅమిరంలోని వైసిపి కార్యాలయంలో టిడిపి గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. సర్పంచి సోమేశ్వరరావుతో పాటు ఆయన అనుచరులు 200 మందికిపైగా టిడిపి నాయకులు వైసిపి కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. రాజకీయాల్లో నామినేటెడ్ పదవుల్లో 50 శాతం పైగానే బిసిలకు స్థానం ఇచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. సర్పంచి డొక్కు సోమేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కార్యకర్తలతో వైసిపిలోకి చేరానని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచి జవ్వాది కిషోర్, వైసిపి నాయకులు జవ్వాది సత్యనారాయణ, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, పెన్మత్స విశ్వనాధరాజు, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, మాజీ ఎంపిపి కందుల వెంకట మల్లికార్జునరావు, బొండాడపేట సర్పంచి గోళ్ల.వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



పెదఅమిరం సర్పంచి సోమేశ్వరరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న పివిఎల్ నరసింహరాజు

మాకు న్యాయం చేయండి

పెర్కిపాలెం జగనన్న కాలనీ లబ్ధిదారులు

ప్రజాశక్తి - వీరవాసరం

పెర్కిపాలెం జగనన్న లేఅవుట్‌లో కేటాయించిన ఇళ్ల స్థలాల గుండా నేషనల్ హైవే వెళ్తోందని, ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని అధికారులు చెప్పడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం టిడిపి బృందం ఆ ప్రాంతాన్ని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల గుండా నేషనల్ హైవే వెళ్తుందని తహశీల్దార్, నేషనల్ హైవే అధికారులు చెప్పారని, అయితే ఇప్పటికే కొంతమంది ఇళ్లు నిర్మించుకోవడంతో వారికి వేరే ప్రాంతంలో స్థలాలు, నష్టపరిహారం అందజేస్తామని, కట్టుకోనివారికి స్థలాలు ఇస్తామని తహశీల్దార్ చెప్పారని తెలిపారు. అయితే అధికారుల మాటలపై తమకు నమ్మకం లేదని, ఇంటి స్థలాలు ఎక్కడ కేటాయిస్తారో, నష్టపరిహారం ఎంత ఇస్తారో, ఏ లబ్ధిదారుల స్థలాలు హైవే పరిధిలోకి వెళ్లాయో తెలియజేసి అధికారుల స్పష్టమైన హామీ ఇవ్వాల్సి ఉందని, లేని పక్షంలో ఆందోళనకు దిగుతామంటూ లబ్ధిదారులు తెలిపారు. అయితే బాధితుల తరపున అధికారులతో మాట్లాడతామని అవసరమైతే కలెక్టర్ వద్దకెళ్లి లబ్ధిదారుల అభిప్రాయాన్ని తెలియజేసేవిధంగా నష్టపోతున్న వారికి మద్దతుగా టిడిపి ఉంటుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ పరిశీలనలో టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్, కముజు హరిబాబు, కడలి వాసు, గొర్రె కృష్ణమూర్తి, నాళం రామారావు, కుక్కల సత్యనారాయణ ఉన్నారు.



పెర్కిపాలెంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న టిడిపి బృందం

సామాన్య కుటుంబం నుంచి ఈస్థాయికి..

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అత్తిలి

సామాన్య కుటుంబం నుంచి మంత్రి స్థాయికి ఎదిగానని రాష్ట్ర పౌరసరఫరాల, వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. మంచిలి ఫంక్షన్ హాల్లో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కారుమూరి నాగేశ్వరరావుకు ఆత్మీయ సన్మాన సభ అజయ్ కుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముందుగా చిన్నారులచే సాంప్రదాయ సాంస్కృతిక జానపద నృత్య కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనది యాదవ జాతి కావడం వల్లే మంత్రి పదవి వచ్చిందన్నారు. రాష్ట్రంలో 25 లక్షల మంది యాదవ కులస్తులు ఉన్నట్లు గుర్తించామన్నారు. 20 వేల మంది యాదవ లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. నేటి యువత భవిష్యత్తులో ఎదుగుతూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాను అతి సామాన్య కుటుంబం నుంచి మంత్రిస్థాయి వచ్చానని, ఇంతటి బాధ్యత తనకు ఇచ్చినందుకు చాలా గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిలి నాయకులు శిరగాని నాగేశ్వరరావు (నాగు), యాదవ సంక్షేమ సంఘం, అఖిలభారత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లగాని సత్యనారాయణ, హైకోర్టు ఎజిపి డొక్కు కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

విద్యార్థులకు అన్ని విషయాలపై అవగాహనుండాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులు క్రీడలు, కళలు, ప్రాపంచిక విషయాలపై అవగాహన కలిగి ముందుకు సాగాలని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు పెద్ద పీట వేశాయన్నారు. చినరంగనిపాలెం పస్తులసాగరం మున్సిపల్ హైస్కూల్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆర్‌డిఒ మాట్లాడారు. క్రమశిక్షణ ఏకాగ్రత ఉండి బట్టీలేని చదువును ప్రతి విద్యార్థీ అలవాటు చేసుకోవాలన్నారు. తాను చదువుకునే రోజుల్లో ఇన్ని సౌకర్యాలు లేవన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి విద్యా సంస్థల ప్రారంభం నుండి ఈ విధమైన ప్రోత్సాహక సహకాలు అందించడం స్ఫూర్తిదాయకమైన కార్యక్రమమని తెలిపారు. నిర్వాహకులు రంగసాయి మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా 10వ తరగతి విద్యార్థులకు దాతల ద్వారా పరీక్ష ఫీజులు అందిస్తూ వస్తున్నామన్నారు. ఎస్‌సిహెచ్ బిఆర్‌ఎం హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కలిగొట్ల గోపాలశర్మ సతీమణి రాజరాజేశ్వరి జ్ఞాపకార్థం 50 మంది 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు, విద్యా సామగ్రి అందించామన్నారు. దాత కలిగొట్ల గోపాలశర్మ మాట్లాడుతూ తాను చదువుకునే రోజుల్లో చాలా ఇబ్బందులు పడ్డామని, రంగసాయి సలహాల మేరకు విద్యార్థులకు సౌకర్యం కల్పిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ నాయకులు నరహరశెట్టి కృష్ణ, కెవి కృష్ణారావు పాల్గొన్నారు.

బీచ్ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంబీచ్ వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. కార్తీక మాసం వెళ్లిన మొదటి ఆదివారం కావడంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు అధిక సంఖ్యలో బీచ్‌కు ఉదయమే తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో, ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. అనంతరం ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

6న భారీ ప్రదర్శనకు తరలిరావాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

వచ్చే నెల 6న తణుకులో జరగనున్న భారీ ప్రదర్శనకు సంఘ సభ్యులు ఉద్యోగులు తరలిరావాలని బామ్‌సెఫ్ అంబేద్కర్ మిషన్ రాష్ట్ర అధ్యక్షులు మధు సంఘీయులకు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయంలో దళిత సంఘ నాయకులు కారుమంచి జీవరత్నం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతం నుంచి దళితుల కున్న పథకాలను రద్దు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో పడవల సత్యనారాయణ, మహిళా బత్తుల రాంబాబు, ఇంగేటి రాజు, బందుల ఎలిజ పాల్గొన్నారు.

ఎబిఎస్‌వికె ఆధ్వర్యాన వైద్య శిబిరం

భీమవరం రూరల్: పట్టణంలోని మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఆదివారం పక్షవాతం, పిట్స్, బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడకు చెందిన డాక్టర్ గోపాలం శివన్నారాయణ మెడికల్ క్యాంపులో మన హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ డి.సందీప్ వర్మ వైద్య సేవలందించారు. తక్కువ ధరకే అవసరమైన మందులు, ఇన్సులిన్ నెలలవారీగా అందజేశారు. రోగులకు పరీక్షలు చేశారు. వసుధ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో పలువురు రోగులకు వసుధ ఫౌండేషన్ ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు, కో ఆర్డినేటర్ ఎంవి.రామరాజు, అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.రాధాకృష్ణ, ఛైర్మన్ బి.బలరాం, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ మల్లుల శ్రీనివాస్, చింతపల్లి శ్రీనివాస్, అజయ్ పాల్గొన్నారు.

నేడు కొడమంచిలో క్రీడాకారుల ఎంపిక

ఆచంట : జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు కొడమంచిలి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆచంట నియోజవర్గ స్థాయిలో క్రీడా పోటీల ఎంపిక నిర్వహిస్తున్నట్లు సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ ఆదివారం విలేకరులు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ పోటీలకు 17 సంవత్సరాలు నిండిన యువతీ యువకుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్న యువతీ యువకులు ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకొని సోమవారం 9 గంటలకు విధిగా హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9912829743 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా ఎన్‌సిసి దినోత్సవం

తాడేపల్లిగూడెం:శశి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం 75వ జాతీయ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ ఎన్‌సిసి పెరేడ్‌లో పాల్గొని జెండా వందనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం, శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ మొహమ్మద్ ఇస్మాయేల్ మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌సిసిలో చేరడం ద్వారా సైన్యం, నౌకాదళం, వైమానిక దళం వంటి ఉద్యోగాల్లో కొలువులు సాధించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.భాను ప్రసాద్, ఎన్‌సిసి క్యాడెట్లు, ఎన్‌సిసి ఆఫీసర్ పి.సోమశేఖర్, పరిపాలన అధికారి ఆర్‌వి బాబు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

మొగల్తూరు:ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ వారి ఆలయం ఆదివారం యాత్రికలతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్మాణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాద్ వితరణ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం ఏర్పాటు చేశారు.

NAME CHANGE

I, GUMPULA BABY SAROJINI, W/o. Gumpula Vara Prasad, D.No. 4-171, Pasaladeevi Village, Narsapur Mandal, West Godavari Dist., A.P., after Marriage I have changed my name from **EDA SAROJINI** (Old Name) to **GUMPULA BABY SAROJINI** (New Name). Hence after all my documents and correspondence will be continue withmy new name **GUMPULA BABY SAROJINI.**

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు మండలం, చెరుకుమిల్లి గ్రామ కాపురస్తులు మండాది కనకరాజు, తండ్రి: మండాది రాములు అనే నేను తెలియజేయునది ఏమనగా.., ది.24-11-2022వ తేదీన మా స్వగృహం చెరుకుమిల్లి నుండి ఆకివీడు నా పాస్‌పోర్టు పని నిమిత్తం వెళ్ళుచుండగా మార్గం మధ్యలో **నా ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. 5627519 పడిపోయినది.** చుట్టు ప్రక్కల ఎంత వెతికిననూ దొరకలేదు ఎవరికైనా దొరికనచో ఈ క్రింది చిరునామాకు అందించగలరు.

మండాది కనకరాజు
తండ్రి: మండాది రాములు,
చెరుకుమిల్లి గ్రామం, ఆకివీడు మండలం,
ప॥గో॥జిల్లా. సెల్: 95539 89798

మహారాజశ్రీ భీమవరం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ 2వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 138/2022

బిట్వీన్:
వాది: కర్రి నాగవెంకట శ్రీనివాస్
మరియు
ప్రతివాది: కిల్లాడ శివశంకర్
టు: ప్రతివాది:
కిల్లాడ శివ శంకర్, తండ్రి: సుబ్రహ్మణ్యం, డో.నెం. 25-9-245, రామలక్ష్మణ్ నగర్, భీమవరం-2.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీకు దావా సమన్లు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను జారీ చేయించినప్పటికీ ప్రతివాది సదరు దావా సమన్లు తీసుకోకుండా తప్పించుకొను చున్నాడు. ప్రతివాది హాజరు నిమిత్తం పై కోర్టు వారు సదరు పై నెంబరు దావాను **ది.13-12-2022 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. కావున ప్రతివాది అయిన మీరు సదరు వాయిదా తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హజరై ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.** లేని ఎడల సదరు వాయిదా తేదీని ప్రతివాది పరోక్షమందు సదరు దావాను తీర్మానించడమగును.

బండి లీలాఫణి శ్రీరామ్
వాది తరపు అడ్వకేట్, భీమవరం.
సెల్: 78939 44559